# మాంసాహార మొక్కలు

పుస్తకాలు బ్యాగులో సర్దుకుని, అమ్మ ఇచ్చిన లంచ్‌బాక్స్ తీసుకుని ఎప్పటికిమల్లే "వెళ్ళొస్తానమ్మా" అంది రమ. గడపదాటి కాలు బైటపెడ్తున్నప్పుడు అమ్మ నాన్నతో అంటున్న మాటలు విన్పించాయి. "ఈ కాలంలో పుట్టాల్సిన పిల్ల కాదండీ. ఎంత బుద్ధిమంతురాలో. మన సంస్కృతీ సాంప్రదాయాల్ని గౌరవించే కూతురుండటం పూర్వజన్మ సుకృతమండీ.... అందునా ఈ రోజుల్లో..."

రమ బియస్సి రెండో సంవత్సరంలో ఉంది.

మొదటి పీరియడ్ బాటనీ... లెక్చరర్ కీటకాల్ని తినే మొక్కల గురించి పాఠం చెప్తోంది.

"పైకి అమాయకంగా కన్పించే మొక్కలు కీటకాల్ని రకరకాల ప్రలోభాలకు లోనుచేసి... ఆకర్షించి... మరలా తప్పించుకోడానికి వీల్లేకుండా బంధించి... చంపేస్తాయి. వీటిని మాంసాహార మొక్కలని అంటారు. ఉదాహరణకు పిచర్ ప్లాంట్... ఇది వెదజల్లే సువాసనలకు  ఆకర్షించబడి కీటకాలు దీనిలోపలికి ప్రవేశిస్తాయి. లోపల అగాధంలా ఉంటుంది. లోపలికెళ్ళిన కీటకం బైటికి రాలేదు. బైటికి రావడానికి శతవిధాలా ప్రయత్నించి, ఓడిపోయి, అడుగున ఉన్న నీళ్ళలో పడి చచ్చిపోయి ఆ మొక్కకు ఆహారంగా మారుతుంది. వీనస్ ఫ్లై ట్రాప్ అనే మొక్క తనకున్న అందమైన రంగుల్తో కీటకాల్ని ఆకర్షిస్తుంది. కీటకం లోపలికి రాగానే ఇనుప తలుపులు మూసుకున్నట్లు దాని ఆకులు మూసుకుపోయి, వాటి మధ్యలో కీటకం నలిగిపోయి చనిపోతుంది. మెల్లమెల్లగా ఈ మొక్క కీటకాన్ని  జీర్ణం చేసుకుంటుంది"

"ఈ పీరియడ్ కాగానే బైటికెళ్దాం రావే" అంది స్వప్న గుసగుసగా.

"ఎక్కడికి?"

"మొదట బైటపడ్దాం. తర్వాత చెప్తాను ఎక్కడికో"

"అమ్మో. నెక్స్ట్ పీరియడ్ కెమిస్ట్రీ. నేనురాను" దిగువ మధ్య తరగతికి చెందిన రమకు చదువు ప్రాముఖ్యత తెలుసు. చదివి ఉద్యోగం తెచ్చుకుంటేనే బతుకు... లేకపోతే భవిష్యత్తంతా అంధకారమే.

"అబ్బ... చదువులో ఏముందే ... బోర్. జీవితాన్ని ఎంజాయ్ చేయాలి. క్లాసులు బంక్ కొట్టని బతుకూ ఓ బతుకేనా? ప్లీజ్ రావే. మన స్నేహం కోసం ఇంత చిన్నపాటి త్యాగం కూడా చేయలేవా?"

రమ ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా కెమిస్ట్రీ లెక్చరర్ వచ్చేలోపల బలవంతంగా క్లాసు బైటికి లాక్కొచ్చింది స్వప్న. స్నేహితురాలికోసం ఆ మాత్రం చేయకపోతే ఎలా అని సర్దిచెప్పుకుంది రమ.

ఇద్దరూ వేగంగా గేట్ వైపుకు నడుస్తున్నారు.

"సరే. ఇప్పుడు చెప్పు. ఎక్కడికి తీసుకెళ్తున్నావ్" రమ అడిగింది.

"నెక్లెస్ రోడ్డుకి. ఈట్ స్ట్రీట్ కెళ్తున్నాం"

"నీకేమైనా పిచ్చా? టైం పదిన్నర. ఇపుడు తిండిగోలేమిటే? అయినా ఆకలేస్తే మన కాలేజీ పక్కనే క్యాంటీన్ ఉందిగా"

"ఇది ఆ ఆకలి కాదులేవే. పడుచు పిల్లలకేసే ఆకలి"

"అర్థమయ్యే భాషలో చెప్పవే"

"ఓ. మరిచేపోయాను. నువ్వు ఇరవైయేళ్ళ ముసలమ్మవి కదా. నీకర్థం కాదులే. మాధవ్ రమ్మన్నాడు. వాడి బైక్ మీద బైటికెళ్ళే ప్రోగ్రాం పెట్టుకున్నా. ఏదైనా మంచి హోటల్లో లంచ్ లాగించేస్తాం. ఆ తర్వాత ఎంజాయ్‌మెంట్"

"ఈ మాధవ్ ఎవడే? నీ బాయ్ ఫ్రెండ్ నీరజ్ ఏమైనాడు?"

"సింపుల్. నీరజ్ పాతబడిపోయాడు. రొటీన్... అబ్బ బోర్ యార్. తుప్పు

పట్టిన వాసన వేస్తున్నాడు. అందుకే డస్ట్‌బిన్‌లో పడేశా. మాధవ్ కొత్త బాయ్ ఫ్రెండ్. వారం క్రితమే ఐమాక్స్ దగ్గర పరిచయమైనాడు".

"నీ బాయ్ ఫ్రెండ్‌ని కల్సుకోడానికెళ్తూ మధ్యలో నన్నెందుకు రమ్మన్నావే పానకంలో పుడకలా"

"ఈ మాధవ్‌గాడు లేట్ లతీఫ్‌గాడే. చెప్పిన టయానికి రాడు. ఒంటరిగా బోర్. నువ్వున్నావనుకో. ఎంచక్కా కబుర్లు చెప్పుకోవచ్చు"

"అతనొచ్చాక నువ్వెళ్ళిపోతావ్. తర్వాత నా పరిస్థితి ఏమిటి?"

"నువ్వూ రావే. కలిసి ఎంజాయ్ చేద్దాం. వాడి పేరు మాధవ్ కదా. ఇద్దరు భామలున్నా నిభాయించుకుంటాడ్లే."

"అమ్మో. నేనా... నీకో నమస్కారం తల్లీ. నన్నిలా బతకనీ. ఈ రొంపిలోకి దింపకు" భయంతో గుండెలమీద చేయి వేసుకుంటూ అంది రమ.

"రొచ్చు... రొంపీ... అంతా ట్రాష్. అమ్మమ్మల భాష. ఒక్కసారి దిగి చూడు. స్వర్గం కన్పిస్తుంది. మన క్లాస్‌లో పాతిక మంది దాకా అమ్మాయిలున్నారా... అందరికీ బాయ్ ఫ్రెండ్స్ ఉన్నారు. నీకు తప్ప. అందులో ఎంత మజా లేకపోతే ఒక్కొక్క అమ్మాయికి ముగ్గురు, నలుగురు బాయ్ ఫ్రెండ్స్ ఉంటారు? ఆలోచించు."

"నాకు మన సంస్కృతి మీద చాలా గౌరవముంది. మీరందరూ వెస్టర్న్ కల్చర్‌ని గుడ్డిగా అనుకరిస్తున్నారు"

"తల్లీ. నీ లెక్చర్లు ఆపుతావా? మన క్లాసులో నీగురించి ఏమనుకుంటున్నారో తెలుసా? ఒక్క బాయ్ ఫ్రెండ్ కూడా లేడంటే నీలోనే ఏదో లోపముందని. సువాసనలేని, సౌందర్యంలేని పూల జోలికి తుమ్మెదలు రావు తెలుసా. అది నీ గొప్పతనమనుకుంటున్నావు. కానీ అందరూ నీ చాతకాని తనమని అనుకుంటున్నారు. మన సంస్కృతి, పరాయి సంస్కృతి... ఇదంతా జీవితాన్ని అనుభవించటం తెలీనివాళ్ళు మాట్లాడే మాటలు.

ఇద్దరూ ఆటో ఎక్కి కూచున్నారు.

రమ ఆలోచనల్లో మునిగిపోయింది. స్వప్న చెప్పింది నిజమే. తన క్లాస్‌లో అమ్మాయిలందరికీ బాయ్‌ఫ్రెండ్స్ ఉన్నారు. తను కావాలనే మగపిల్లలకు దూరంగా ఉంది. వయసొచ్చినప్పటినుండీ అమ్మ నూరిపోసిన మాటలు తన మీద చాలా ప్రభావం చూపించాయి. 'ప్రపంచ దేశాల్లో భారతదేశం తలయెత్తుకు నిలబడటానికి కారణం మన గొప్ప సంస్కృతి అనే విషయం మరవొద్దు. హైద్రాబాద్ సిటీ ప్రస్తుతం కల్చరల్ క్రైసిస్‌లో ఉంది. మన యువతని విదేశీ సంస్కృతి వెల్లువలా ముంచెత్తుతోంది. ఇప్పటికే మెడదాకా మునిగిపోయాం. ఇక పూర్తిగా మునిగి వూపిరాడక చచ్చిపోయే రోజు ఎంతో దూరంలో లేదు. నువ్వు జాగ్రత్తగా ఉండు. ఆడపిల్లవి కాబట్టి ఒద్దికగా ఉండాలని చెప్పటం లేదు. నువ్వు ఈ తరం అమ్మాయివి. దానికి తగ్గట్లే ఉండు. మగపిల్లల్తో మాట్లాడటం తప్పని నేననను. నీ హద్దుల్లో ఉండు. సో ఫార్ నో ఫర్దర్ అంటారే... అలా... నైతిక విలువలు పతనం కానంత వరకూ మోడర్నిటీలో తప్పులేదు.

మగపిల్లల్తో స్నేహం చేస్తే తప్పేమిటని తనూ చాలా సార్లు ఆలోచించింది. కానీ తన క్లాస్‌లోని అమ్మాయిల స్నేహాలు ఎలాంటివో తెలిశాక ఆగిపోయింది. ఇపుడు స్నేహమంటే మనసుకే పరిమితం కాదు. శరీరానికి కూడా... కలిసి తిరగడాలు, డేటింగులు, నెక్కింగులు... అసలేదీ నిషిద్ధం కాదు.

ఈట్ స్ట్రీట్ దగ్గర ఆటో దిగాక,"రావే. మాధవ్ వచ్చేవరకు లోపల కూచుని కబుర్లు చెప్పుకుందాం" అంది స్వప్న.

రెండు ఐస్ క్రీంలు కొనుక్కుని ఖాళీగా ఉన్న టేబుల్ దగ్గర కూచున్నారు.

పక్కన మంద్రమైన అలలతో అల్లిబిల్లి కబుర్లు చెప్తున్న హుసేన్ సాగర్ జలాలు... నగరంలో విస్తరిస్తోన్న విషసంస్కృతికి విస్తుపోయి శిలగా మారిన బుద్ధుడి విగ్రహం... చల్లటి గాలి... తియ్యటి చల్లటి ఐస్ క్రీం... పాష్‌గా, మోడర్న్‌గా డ్రెస్ చేసుకున్న అమ్మాయిల కేరింతలు... వాళ్ళ పక్కనున్న అబ్బాయిల తుళ్ళింతలు...

ఆ హోటల్‌కి రావటం రమకు అదే మొదటిసారి. "ఇక్కడ చాలా బావుందే" అంది రమ.

"నాతో కాదే. నీమనసుకి నచ్చిన కుర్రాడితో వచ్చినపుడు ఆ థ్రిల్ ఏమిటో తెలుస్తుంది. నేనూ మొదట వినయ్‌తో వచ్చానిక్కడికి. వినయ్‌ని నువ్వు చూళ్ళేదులే. ఇంటర్‌లో నా బాయ్ ఫ్రెండ్."

"ఇంటర్ నుంచే బాయ్ ఫ్రెండ్స్ ఉండేవాళ్ళా తల్లీ?"

"నేనింకా నయమే. నా ఫ్రెండ్ సుజాత ఉందే దానికి టెన్త్ క్లాస్‌నుండే ఉన్నారు. ఈ వయసులో కాకపోతే ఎప్పుడు ఎంజాయ్ చేస్తాం చెప్పు. పెళ్ళయ్యాక ఎలాగూ ఆంక్షలు తప్పవు. నామాట విను. ముసలమ్మలా ఎన్నాళ్ళు ఇలా ముడుచుకుని కూచుంటావు? కళ్ళు తెరిచి చుట్టూ ఉన్న సమాజాన్ని ఒకసారి చూడు. ఎంత ఫాస్ట్‌గా మారిపోతోందో... ఒకప్పుడు బాయ్ ఫ్రెండ్ ఉన్నాడని చెప్పుకోవడం నామోషీగా భావించేవారు. చేసేవాళ్ళందరూ గుట్టుగా చేసేవాళ్ళు. కానీ ఇప్పుడో... ఎంత ఎక్కువ మంది బాయ్ ఫ్రెండ్స్‌ని మెయింటైన్ చేస్తే అంత గొప్ప"

"తప్పు కదా. మన సంస్కృతీ సాంప్రదాయాలు...."

"అంతా డొల్ల... శుష్క వేదాంతం. ఇప్పుడున్న జీవితాన్ని ఎంచక్కా ఎంజాయ్ చేయకుండా మడికట్టుకుని కూచుని... చచ్చాక స్వర్గానికెళ్ళి సుఖాలు అనుభవిస్తామా? నాన్సెన్స్. చచ్చాక ఏమౌతుందో నీకు తెలుసా నాకు తెలుసా? ఈ క్షణమే నిజం... ఈ రోజు మనది. రేపేమౌతుందో తెలీదు. మన ఎదురుగా రాసులుగా పోసి ఉన్న సుఖాల్ని మూర్ఖంగా కాలదన్నుకోకు. ఎంజాయ్ చేయడానికి ఇదే సరైన టైం. దొరికినంత అందుకో... అందినంత జుర్రుకో"

"అమ్మో"

"ఏమిటే అమ్మో... మరోసారి అమ్మో అన్నావంటే చంపేస్తా. ఆడపిల్లలు ఎంత ధైర్యంగా ఉన్నారో చూడు. ఒక్కసారి మంచి కుర్రాడితో స్నేహం చేసి

చూడు. నీ భయాలు గియాలు దెబ్బకు ఎగిరిపోతాయి."

"అలా కుర్రాళ్ళతో తిరిగితే ధైర్యంగా ఉన్నట్లా? బరితెగించినట్లుకాదా?"

"ఆడపిల్ల బరిలో ఉండాలని నిర్ణయించే అధికారం సమాజానికెవరిచ్చారు? మన జీవితాల్ని శాసించేంత చనువు మనమెందుకివ్వాలి? అసలు బరే లేనపుడు దాన్ని తెంచడమనే సమస్యే రాదు. ఎల్లలు లేని స్వేచ్ఛ మన స్వంతం. మనసుకు నచ్చిన అబ్బాయితో వూసులాడటంలో ఉన్న హాయి... వాడితో కలిసి బైక్ మీద షికార్లు కొట్టటంలో ఉన్న తీపి... అనుభవించని ఆడపిల్ల బతుకు దండగ"

"నిజంగా అంత బావుంటుందా?"

"మెల్లగా అంటావేమిటి? ఒక్కసారి రుచి చూసావా... ఇక వదలమన్నా వదలవు"

"అమ్మో వద్దు" అంది రమ. కొద్దిసేపాగి "ఐనా నాకు నచ్చే కుర్రాడు దొరకాలంటే వెతకొద్దూ... నేనెక్కడ వెతకనూ"

"అదా నీ సమస్య? నీకు శ్రమలేకుండా నేను వెదికిపెడ్తాలేవే. స్నేహితురాలికోసం ఆ మాత్రం చేయలేనా?" అంది స్వప్న.

వాళ్ళు కూచున్న టేబుల్ దగ్గరకో కుర్రాడొచ్చి, అభివాదం చేస్తున్నట్లు కొద్దిగా ఒంగి "హాయ్ స్వీట్ హార్ట్" అన్నాడు స్వప్నతో.

"హాయ్ లేట్ లతీఫ్. గంటాలస్యమైంది తెలుసా. అసలు నీకోసం ఇంతందమైన అమ్మాయి ఎదురుచూస్తుంటే ఆలస్యం చేయడానికి మనసెలా ఒప్పిందీ" స్వప్న బుంగమూతి పెట్టింది.

"మనసా... ఏం మనసు? నాదగ్గర లేదు. నీకెప్పుడో ఇచ్చేశాగా" అన్నాడతను కొంటెగా.

"చాల్లే. నువ్వు మాటకారివని నాకు తెలుసులే" అంటూ రమ వైపు తిరిగి, "రమా. దిసీజ్ మాధవ్. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. వర్కింగ్ ఇన్ విప్రో. మాధవ్...

దిసీజ్ రమ. మై బెస్ట్ ఫ్రెండ్" అంది.

"హాయ్" అంటూ అతను చేయి చాపాడు.

రమ బెరుగ్గా స్వప్న వైపు చూసింది.

"పర్లేదులే చేయి కలపవే. నిన్నేమీ కొరుక్కుతినడు" అంది నవ్వుతూ స్వప్న.

అతను రమ చేతిని సున్నితంగా నొక్కి వదిలాడు. రమ సిగ్గుల మొగ్గయింది.

"మీ ఫ్రెండ్‌కి సిగ్గెక్కువనుకుంటాను" అన్నాడతను. రమ ఓరకంట అతన్ని చూసింది. తెల్లగా పొడవుగా ఉన్నాడతను. స్లిమ్‌గా ట్రిమ్‌గా ఉన్నాడు. వెనక్కి దువ్విన జుట్టు...అల్లరిగా నవ్వే కళ్ళు... అందంగా ఉన్నాడు.

"దీని సిగ్గు దొంగలు దోలా... దాని చేతిని తాకిన మొట్టమొదటి మగాడివి నువ్వే తెలుసా. కంగ్రాట్స్" అంది స్వప్న.

"ఓ. ఐయాం సో లక్కీ. యాహూ"

"దీనికో మంచి బాయ్ ఫ్రెండ్‌ని వెదికి పెట్టు. అప్పటిగ్గాని ఇది మనిషి కాదు"

"ఆశ్చర్యంగా ఉందే. ఇంతందమైన అమ్మాయికి ఇప్పటివరకు బాయ్ ఫ్రెండ్సే లేరా?" అని ఓ క్షణమాగి "ఐనా ఎవర్నో వెదకటం దేనికి? నేనున్నానుగా" అన్నాడు.

"చంపేస్తా" అంది స్వప్న కళ్ళు పెద్దవి చేసి తర్జనితో బెదిరిస్తూ.

"సారీ సారీ. జోక్ చేశానంతే. నా కొలీగ్ సామ్రాట్ ఉన్నాడు. రేపే పిల్చుకొచ్చి పరిచయం చేస్తాను"

"బావుంటాడా? మొదట నాకు చూపించు. నేను ఓకే చేశాకే రమకు పరిచయం చేద్దాం"

"పేరుకు తగ్గట్టే అందగాడు. నాకంటే బావుంటాడు. సరేనా"

 

"ఐతే నన్ను లైనేయమంటావా?" అంది అల్లరిగా స్వప్న.

"నన్నన్యాయం చేస్తావా ప్రియా?" అన్నాడతను గుండెల దగ్గర పట్టుకుంటూ.

"టేకిట్ ఈజీరా. సరదాగా అన్నాలే. పద వెళ్దాం. ఈ రోజు ఎక్కడికి పిల్చుకెళ్తావో నీ ఇష్టం. రాత్రి తొమ్మిది వరకు నీ అధీనంలో ఉంటాను. ఏం చేస్కుంటావో చేస్కో" అంది.

రమని ఆటో ఎక్కించి పంపించాక, "నీకిచ్చిన మాట నిలబెట్టుకున్నాను. నీ ఫ్రెండ్ కోసం అమ్మాయిని చూసి పెట్టమన్నావుగా. రమ అమాయకురాలు. దాన్ని జాగ్రత్తగా చూసుకోమని చెప్పు" అంది స్వప్న.

రమకు ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఈట్ స్ట్రీట్‌లో వాళ్ళిద్దరి మాటలు వింటుంటే... వాళ్ళ మొహాల్లో కదలాడిన సంతోషం చూస్తుంటే ఈర్ష్యగా అన్పించింది. తనకూ అలాంటి బాయ్ ఫ్రెండ్ ఉంటే ఎంత బావుంటుంది! అనే ఆలోచన మొగ్గ తొడిగి... పూవుగా మారింది.

సామ్రాట్ అట. పేరు ఎంత బావుందో... మనిషి కూడా బావుంటాడని కదా అన్నాడు. నీ మనసుకి నచ్చిన కుర్రాడితో స్నేహం చేయి అంది స్వప్న. చూడంగానే మనసుకి నచ్చాడోలేదో ఎలా తెలుస్తుంది? కంటికి నచ్చిన కుర్రాడితో అనాలేమో... సామ్రాట్‌తో ఎంత చనువుగా మెలగాలి? స్వప్న మాధవ్‌తో ఉన్నంత చనువుగానా... వుహు. తనలా ఉండలేదు. అమ్మ నాన్నతో ఎన్ని సార్లో తన గురించి మురిసిపోతూ చెప్పటం తను వింది. 'టీవీలు, సినిమాలు చూసి నేటి తరం పిల్లలు చెడిపోతున్నారండీ. పదో తరగతి నుండే ప్రేమాదోమా అంటూ భవిష్యత్తుని పాడు చేసుకుంటున్నారు. మన పిల్ల చూడండి. తన చదువేదో తనేదో. చివరికి వూహల్లోకి కూడా చెడు ఆలోచనల్ని రానివ్వదు.

తను కేవలం స్నేహం చేస్తుందంతే. తనకు తన హద్దులేమిటో తెలుసు. అనుకున్నాక మనసులోని అలజడి తగ్గి కొద్దిగా నిద్ర పట్టింది.

★ ★ ★

ఓ నెల గడిచింది. సామ్రాట్‌తో పార్కులకూ హోటళ్ళకు వెళ్ళటం... గంటల తరబడి కబుర్లు చెప్పుకోవటం... అసలిన్నాళ్ళూ ఇటువంటి సంతోషానికి, సుఖానికి ఎందుకు దూరంగా ఉన్నానా అని బాధ పడింది రమ. ఈ మధురమైన, అద్భుతమైన స్వర్గాన్ని తనకు పరిచయం చేసిన స్వప్నకు మనసులోనే ఎన్నోసార్లు కృతజ్ఞతలు తెల్పుకుంది.

మొదట్లో క్లాసులు ఎగ్గొట్టటం ఇబ్బందనిపించినా రాను రాను అలవాటైపోయింది. యింట్లో వాళ్ళకు అబద్ధాలు చెప్పటం కూడా...

శనివారం రోజు క్లాసులయిపోయాక బస్ స్టాప్ వైపుకు నడుస్తూ," రేపేమిటే నీ ప్రోగ్రాం" అని అడిగింది స్వప్న.

"నథింగ్ స్పెషల్"

"మా మాధవ్ గాడు రేపో స్పెషల్ ప్రోగ్రాం అరేంజ్ చేశాడు. కారు తెస్తాడట. నువ్వూ, నేను, సామ్రాట్... పబ్‌కెళ్ళాలని ప్లాన్. యింట్లో ఏదో ఒకటి చెప్పిరా. ఫుల్‌డే... రాత్రి పదో పదకొండో కావచ్చు"

"పబ్‌కెళ్ళి ఏం చేస్తాం?" పబ్‌ల గురించి విని ఉన్నా కన్‌ఫర్మ్ చేసుకోడానికి అడిగింది.

"డ్రింక్స్ తీసుకుంటాం. లైట్‌గానేలే. ఆ తర్వాత డ్యాన్స్... తర్వాత డిన్నర్"

"డ్రింకులా... అంటే కోక్, పెప్సీలాంటివా?"

"నీ బొంద... హాట్ డ్రింక్స్"

"అమ్మో.... నేనురాను"

"ఈ అమ్మో అనే పదం ఇంకా వదల్లేదా? సామ్రాట్ ఏం చేస్తున్నాడు? చాతకాని దద్దమ్మలా ఉన్నాడే. ఆడపిల్లల డ్రింకులు వేరే ఉన్నాయిలేవే... బీర్, జిన్, వైన్... చాలా లైట్‌గా ఉంటాయి. కోక్ తాగినట్లే అనుకో"

"తాగాక ఎట్లా ఉంటుంది" ఓ వైపు కుతూహలం బాధిస్తుండగా అడిగింది.

"చాలా బావుంటుంది. గాల్లో తేలుతున్నట్లుంటుంది. మేఘాల్లో విహరిస్తున్నట్లుంటుంది. తాగి డ్యాన్స్ చేస్తుంటే నక్షత్రలోకంలో ఉన్నట్లుంటుంది"

"మా యింట్లో తెలిస్తే తిడ్తారు. నాకొద్దు. నేను కూల్‌డ్రింకే తీసుకుంటా"

"సరే నీ ఇష్టం. ఐనా యింట్లో వాళ్ళకు చెప్తామేమిటి? చెప్పే సామ్రాట్‌తో తిరుగుతున్నావా? ఇదీ అంతే" అంటూ నవ్వింది స్వప్న.

మరునాడు కార్లో డ్రైవింగ్ సీట్లో మాధవ్, పక్కన స్వప్న కూచున్నారు. సామ్రాట్‌తో కలిసి పబ్‌కెళ్ళటం ఎంతో ఎగ్జయిటింగ్‌గా ఉంది రమకు. పబ్‌కెళ్ళే ఆడపిల్లల సంఖ్య పెరిగిందని తను చాలా సార్లు పేపర్లలో చదివింది. టీవీ మీడియాలో పబ్ కల్చర్ మంచిదా కాదా అనే చర్చలు వింది. పబ్‌లెలా ఉంటాయో చూడాలని ఇన్నాళ్ళుగా అణచిపెట్టుకున్న కోరిక ఈ రోజు తీరబోతున్న ఆనందం ఆమె మొహంలో కాంతి పుష్పంలా విచ్చుకుంది.

"జిన్ అంటే ఏంటో తెలుసా? ఉత్త లైమ్ జ్యూస్. నీ చుట్టూ ఒక్కసారి చూడు. అమ్మాయిలు హుషారుగా విస్కీలు, రమ్ములు ఎలా లాగించేస్తున్నారో" సామ్రాట్ బలవంతపెడ్తుంటే 'ఏం చేయమంటావు' అన్నట్లు స్వప్న వైపు చూసింది.

అప్పటికే స్వప్న రెండో పెగ్గులో ఉంది. "నోటిదాకా వచ్చిన అమృతాన్ని కాలదన్నుకుంటావో లేక మోడర్న్ గర్ల్‌లా మందు కొడ్తావో నీ ఇష్టం" అంది. ఆమె మాట ముద్దముద్దగా ముద్దుముద్దుగా ఉంది. కళ్ళు స్వాప్నిలం కావడం స్పష్టంగా తెలుస్తోంది.

తాగితే ఎలా ఉంటుందోనన్న ఉత్సుకత... ఒక్కసారి తాగితే తప్పేముందన్న వాదన... 'దీనికి బానిస కాకుండా నన్ను నేను కంట్రోల్ చేసుకునే మానసిక శక్తి నాకుంది కదా. మరెందుకు భయం' అనే ఆత్మ వంచన...

రమ జిన్‌లో మిరిండా కలుపుకుని తాగింది. బావుంది... సామ్రాట్ మరో పెగ్ అందించాడు. ఈసారి హాయిగా, ఏరకమైన సంకోచం లేకుండా ఎంజాయ్ చేస్తూ తాగింది. తల దిమ్ముగా ఉంది. శరీరం తేలికైంది. అడుగులు భూమికి

అడుగెత్తున పడ్తున్నట్లు....

పూరిస్తున్న వాతావరణం... వూపేస్తున్న సంగీతం... శరీరంలో ఏదో తెలీని తీపి ఆరాటం... అప్రయత్నంగానే డ్యాన్స్‌ఫ్లోర్ పైన నిలబడి... సామ్రాట్‌తో కలిసి డ్యాన్స్ చేస్తుంటే... ఎంత బావుందో...

తిరిగి ఇళ్ళకు బయల్దేరేప్పటికి రాత్రి పదకొండున్నర దాటింది. 'రమ రాత్రికి రాదని తమింట్లోనే ఉండి చదువుకుంటుందని' స్వప్న రమవాళ్ళింటికి ఫోన్ చేసి చెప్పింది.

బంజారాహిల్స్ రోడ్ నంబర్ పన్నెండు మలుపు దగ్గర పోలీసులాపేశారు.

మూతలు పడ్తోన్న రమ కళ్ళు భయంతో విచ్చుకున్నాయి.

"కంగారు పడకు. మాధవ్ ఉన్నాడుగా. మేనేజ్ చేస్తాడు" ధైర్యం చెప్పింది స్వప్న.

బ్రీత్ ఎనలైజర్‌తో నలుగుర్నీ టెస్ట్ చేశారు.

"తాగి డ్రైవ్ చేయటం నేరం. మీరు నలుగురూ తాగి ఉన్నారు" అన్నాడు యస్సై.

"ఆడపిల్లలు తాగడం ఎక్కువైపోయింది సార్. నిన్న రాత్రి పన్నెండు మందిని బుక్ చేస్తే అందులో ఎనిమిది మంది తాగి డ్రైవ్ చేస్తున్న అమ్మాయిలే" అన్నాడు కానిస్టేబుల్.

"గ్లోబలైజేషన్ పుణ్యమా అంటూ పాశ్చాత్య సంస్కృతి మన గడపలు దాటి ఇళ్ళలోకి వచ్చేసింది. ఏం చేస్తాం" అని మాధవ్ వైపు తిరిగి "ఆడపిల్లల మీద కేసులు పెట్టం. వాళ్ళ పేరెంట్స్‌కి ఫోన్ చేసి చెప్పి వాళ్ళని ఆటోలో ఇంటికి పంపించే ఏర్పాటు చేస్తాం. మీ ఇద్దరిమీదా కేసులు పెడ్తాం" అన్నాడు యస్సై. మాధవ్ పక్కనే సామ్రాట్ నిలబడి ఉన్నాడు.

రమకు భయంతో చెమటలు పడ్తున్నాయి. తాగిన మత్తంతా దిగిపోయింది.

ఇపుడు వీళ్ళు ఇంటికి ఫోన్ చేసి తన అమ్మానాన్నకు విషయం చెప్తే ఇంకేమైనా ఉందా...

"ప్రతి చిన్న దానికి ఎందుకంత వర్రీ అవుతావు? నేనున్నానుగా. నువ్వు నా సిస్టర్ అని చెప్తా. మా యింటి నెంబరే ఇస్తా. సరేనా... ఐనా అంతదాకా రానివ్వడు మాధవ్. వాడి మేనేజీరియల్ కెపాసిటీ మీద నాకు నమ్మకముంది. అనుభవంతో చెప్తున్నా. నథింగ్ విల్ హేపెన్" అంది స్వప్న.

ఆమె చెప్పినట్లే కేసేమీ లేకుండా మేనేజ్ చేశాడు మాధవ్.

"వెయ్యి రూపాయలు సమర్పించుకున్నా" డ్రైవింగ్ సీట్లో కూచుంటూ అన్నాడు.

"డబ్బేగా... పోన్లే. పరువు ముఖ్యం" అంది స్వప్న.

★ ★ ★

పరీక్షలు దగ్గర పడ్తున్నా చదవలేకపోతోంది రమ. మనసులో ఏదో చిక్కుముడి. అసహనం... ఆరోగ్యం బావుండటం లేదు. తన శరీరంలో మరో శరీరం రూపుదాల్చుకునే ప్రయత్నంలో కలుగుతున్న అలజడి.

"ఎందుకీ మధ్య డల్‌గా ఉంటున్నావు?" అడిగింది స్వప్న.

"డల్‌గానా... కాదు. దిగులుగా ఉంటున్నాను. విపరీతమైన డిప్రెషన్‌లో ఉన్నాను" రమ కళ్ళలో నీళ్ళు ఉబికాయి.

"ఓ... సీరియస్ సమస్యలా ఉందే. నాకెందుకు చెప్పలేదూ? సాగ్రమాట్‌తో గొడవ పడ్డావా?"

"ఔను"

"ఇంత చిన్న విషయానికి డిప్రెషనా? వాడు కాకపోతే వాడిలాంటివాళ్ళు కో అంటే కోటిమంది. ఎడంకాలితో తన్ని వదిలెయ్ వాణ్ణి"

"నేను నెల తప్పాను"

మొదట విస్మయంగా చూసింది స్వప్న.

"అంత ఫూలిష్‌గా ఎలా ఉన్నావే. జాగ్రత్తలు తీసుకోవాలని తెలీదా? వాడికేం మగాడు. కడుపొస్తే కష్టాలు మనకేగా"

"నువ్వేగా చెప్పావ్ మనం మగవాళ్ళతో అన్నిట్లో సమానమేనని. ఒకప్పుడు వాళ్ళు నలుగురైదుగురు అమ్మాయిల్తో తిరిగేవారు. ఇపుడు మన ఛాన్స్. మనం నలుగురైదుగురు అబ్బాయిల్తో తిరుగుతున్నాం అని"

సమాధానం చెప్పడానికి స్వప్న తడబడింది.

"సమానమే అనుకో. ఐనా ఆ దేవుడున్నాడో లేడో తెలీదు కానీ ఉంటే మాత్రం చాలా పక్షపాతి. ఆడపిల్లల్ని ఈ విషయంలో అన్యాయం చేశాడు"

"నాకేం చేయాలో తెలీటం లేదే. భయమేస్తోంది" రమ వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తోంది.

"భయం దేనికి? చాలా సింపుల్. నాకు తెల్సిన హాస్పిటల్ ఉంది. అబార్షన్ చేయించుకో"

"అబార్షనా?"

"ఈ రోజుల్లో చాలా కామన్ తెలుసా. మూడు నాలుగు సార్లు అబార్షన్లు చేయించుకున్న అమ్మాయిలు కూడా ఉన్నారు. టేకిట్ ఈజీ యార్. జీవితం ఏడ్వటానికి కాదు. ఎంజాయ్ చేయడానికి"

"స్క్రౌండ్రల్ మోసం చేసి ఇలా మధ్యలో వదిలేస్తాడనుకోలేదు"

"మోసం దగాలాంటి పెద్ద మాటలు వద్దు. నో సెంటిమెంట్స్. వాడు నీతో ఆడుకున్నాడు. నువ్వు వాడితో ఆడుకున్నావు. దట్సాల్"

"అతని జ్ఞాపకాలు బాధిస్తున్నాయే"

"అంతా ట్రాష్. మరో కుర్రాడితో పరిచయమైతే అవన్నీ మరుగున పడిపోతాయి. వారం క్రితం మాధవ్‌తోపాటు ఓ కుర్రాడొచ్చాడు. ఇంజనీరింగ్

ఫైనలియర్ చేస్తున్నాడు. స్వంత కారుంది. బాగా డబ్బుంది. అబార్షన్‌కయ్యే ఖర్చు వాడి దగ్గర లాగేయ్. వాళ్ళనాన్నకు ఏదో బిజినెస్ ఉందట. కుర్రాడు బావున్నాడు. రేపు పరిచయం చేస్తాను"

రమ బేలగా ఆమెవైపు చూసింది.

"నా మాట విను. ఇవన్నీ ఇప్పుడు అమ్మాయిలకు మామూలే. నువ్వే ఇంకా గాడిలో పడలేదు. డోంట్ వర్రీ. నేను చెప్పినట్లు చేయి" అంది స్వప్న.

దుఃఖంతో నిండిపోయిన రమ కన్నీటి సముద్రంలా ఉంది.

రాత్రి ఏడుగంటల సమయం... నగరం రంగురంగుల విద్యుద్దీపాల్తో సింగారించుకున్న అభిసారికలా ఉంది.

ఇంటి వైపుకు నడుస్తుంటే దారికిరువైపులా ఎక్కడ చూసినా మాంసాహార మొక్కలు నిండిపోయినట్లు... కీటకాలు తినే చిన్న చిన్న మొక్కలు కాదు... మనుషుల్ని తినే మొక్కలు... తమ అందమైన రంగురంగుల వలల్ని విసిరి... సువాసనల మంత్రజలం చల్లి... మనుషుల్ని ఆకర్షించి... కొద్దికొద్దిగా జీర్ణం చేసుకునే మొక్కలు...

బరువైన అడుగుల్తో ఇంటిలోపలికి అడుగుపెట్టి, తన గదిలోకి వెళ్ళబోతున్నప్పుడు అమ్మ నాన్నతో అంటున్న మాటలు విన్పించాయి. "మనమ్మాయి ఎంత బుద్ధిమంతురాలో... ఈ కాలం పిల్ల కాదు"

రమ తలొంచుకుని తన గదిలో కెళ్ళిపోయింది.

(నవ్య వారపత్రిక)

★ ★ ★